సంపుటి :02 సంచిక :206 పేజీలు :04 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

## మరోసారి పొడిగింపు



- డిసెంబర్ 31 వరకు స్మార్ట్ సిటీ పథకం గడువు
- ఎంపీ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేంద్రం

04

## 12న ఉచిత మెగా హెల్త్ క్యాంపు

ముఖ్యఅతిథిగా హాజరుకానున్న మంత్రి సీతక్క



02

శుక్రవారం 10, సెప్టెంబర్ 2025

# కొన్నట్టు.. కనికట్టు!



## రూ.1.70 కోట్లు స్వాహా

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కుంభకోణాల్లోనే హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని సాంబశివ రైస్ మిల్లు యజమాని రూటే సపరేటు. ఇంతకముందు యాజమానులంతా ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించిన ధాన్యాన్ని గుట్టుచప్పుడుకాకుండా బయట అమ్ముకుని సొమ్ము చేసుకోవడం, పౌరసరఫరాలశాఖకు తిరిగి రైస్‌ను అప్పగించకపోవడం మనం చూస్తుంటాం. యంత్రాంగం ఎన్ని హెచ్చరికలు చేసినా పట్టించుకోకపోవడాన్ని చూసి ఉంటాం. కానీ, తాజా కుంభకోణం అలాంటిది కాదు. అసలు రైతులెవరూ ధాన్యం పండించరు. కానీ, వ్యవసాయశాఖ అధికారులు మాత్రం విక్రయానికి అనుమతులిస్తారు. ఐకేపీ సేకరణ కేంద్రాల్లో ధాన్యం సేకరించినట్లు ఆధారాలు ఉంటాయి. అక్కడి నుంచి రైస్‌మిల్లుకు సీఎంఆర్ కోసం ధాన్యం దిగుమతి అయినట్లు పత్రాలు ఉంటాయి. చివరకు సదరు రైస్‌మిల్లు యాజమాని భార్య, కుమార్తె, అల్లుడు సహా ఇతర కుటుంబ సభ్యులు, బంధువుల బ్యాంకు ఖాతాల్లో ధాన్యానికి సంబంధించిన రూ.1.70 కోట్ల ప్రభుత్వ సొమ్ము కూడా జమ అవుతుంది. ఇటీవల విజిలెన్స్‌శాఖ సదరు రైస్ మిల్లును తనిఖీ చేయగా, ఈ బాగోతమంతా బయటపడింది. ఇలాంటి నయా కుంభకోణం జరిగిందని తెలుసుకున్న వారిప్పుడు ముక్కున వేలేసుకుంటున్నారు. - అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

- సాంబశివ రైస్ మిల్లు యజమాని లీలలే వేరయా !
- రెండు ఐకేపీ కేంద్రాలతో ముందస్తు ఒప్పందం
- సుమారు 35 మంది నుంచి ధాన్యం సేకరించినట్లు రికార్డులు
- ఆ ధాన్యం మొత్తం రైస్ మిల్లులో దిగుమతి అయినట్లు పత్రాలు
- వ్యవసాయ, పౌర సరఫరాలశాఖల అండదండలతో కుంభకోణం
- భార్య, కుమార్తె, అల్లుడు సహా బంధువుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమ
- విజిలెన్స్ తనిఖీల్లో బయటపడిన బాగోతం.. అదనపు కలెక్టర్‌కు అందిన నివేదిక

02



ముగ్గురు మావోయిస్టు పార్టీ

## అగ్రనేతలు లొంగుబాటు

వివరాలు వెల్లడించిన డీజీపీ శివధర్‌రెడ్డి

02

## కాటారంలో మట్టి తోడేళ్లు..!

### యథేచ్ఛగా సాగుతున్న మట్టి దందా

కాటారం మండలంలో మట్టి తోడేళ్ళు రాజ్యమేలుతున్నాయి. చెరువు, కుంటలు కనిపిస్తే చాలు కొందరు ట్రాక్టర్ యజమానులు తోడేళ్లుగా అవతారమెత్తి యథేచ్ఛగా మట్టిని తోడేస్తున్నారు. రాత్రింబవళ్ళు అనే తేడాలేకుండా వందల సంఖ్యలో ట్రాక్టర్లు రయ్.. రయ్ మంటూ మట్టిని తరలిస్తున్నారు. ప్రధాన రహదారుల గుండానే బాజాప్త మట్టి ట్రాక్టర్లు వెళ్తుండగా చూస్తూ ఊరుకోవడం సమాజం వంతు అవుతున్నది. ఓవైపు సీసీ రోడ్లతో పాటు ప్రధాన రహదారులు ధ్వంసం అవుతుండగా మరో వైపు ట్రాక్టర్లు అధిక వేగంతో వస్తుండంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ వ్యవహారంపై ఇదేంటనే ప్రశ్నించే నాథుడే లేక పోవడంతో అందరికీ తెలిసే జరుగుతుందా అని ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కాటారం మండలంలో మట్టి తోడేళ్ల వ్యాపారం ఇష్టారాజ్యంగా నడుస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. - అక్షరదర్బార్, కాటారం



05

- సిండికేటైనా ట్రాక్టర్ యజమానులు
- వందలాది ట్రాక్టర్లతో మట్టి కొడుతున్న వైనం
- సెలవు దినాలే వారి టార్గెట్
- ధ్వంసమవుతున్న సీసీ రోడ్లు, ప్రధాన రహదారులు
- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు

# చోరీ నిందితుల అరెస్ట్

## ఆభరణాలు, నగదు స్వాధీనం

అక్షర దర్బార్, ఆత్మకూరు : చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేశామని పరకాల ఏసీపీ సతీష్ బాబు తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు మండలం కటాక్షపూర్ గ్రామంలో వాహన తనిఖీలు చేస్తుంటే అనుమానాస్పదంగా ఉన్న మైనర్ నిందితులతో సహా ఇద్దరిని అరెస్ట్ చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ హనుమకొండకు చెందిన పాశం ప్రణీత్, సరిగొమ్ముల లియో స్పర్జన్ రాజ్, ఇద్దరు మైనర్లు మద్యానికి అలవాటు పడి జూన్ 4న తన్నిముట్టి సాయితో కలిసి ఆత్మకూర్ మండలం గూడెప్పాడ్ లోని రామాలయంలో వేయి రూపాయల నగదు, రాముల వారి వెండి జంజరం, రెండు బంగారు గంటె పుస్తెలు వాటి మొత్తం విలువ రూ.28వేలు దొంగతనం చేశారని తెలిపారు. అలాగే దుగ్గొండి మండలం గిర్నిబావి వద్ద గల ఒక వైన్ షాపులో వెంటిలేటర్ కు వున్న గ్రిల్స్ ను పగులగొట్టి కౌంటర్ లో రూ.12వేల నగదు, మద్యం బాటిల్లు దొంగతనం చేశారని తెలిపారు. నిందితుల నుండి ఆభరణాలు, ద్విచక్ర వాహనం, రూ.12నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ అరెస్టులో ఆత్మకూరు సీఐ సంతోష్, ఎస్సై తిరుపతి, సతీష్, కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






# కొన్నట్టు.. కనికట్టు

## రూ.1.70 కోట్లు స్వాహా

- సాంబశివ రైస్ మిల్లు యజమాని లీలలే వేరయా !
- రెండు ఐకేపీ కేంద్రాలతో ముందస్తు ఒప్పందం
- సుమారు 35 మంది నుంచి ధాన్యం సేకరించినట్లు రికార్డులు
- ఆ ధాన్యం మొత్తం రైస్ మిల్లులో దిగుమతి అయినట్లు పత్రాలు
- వ్యవసాయ, పౌర సరఫరాలశాఖల అండదండలతో కుంభకోణం
- భార్య, కుమార్తె, అల్లుడు సహా బంధువుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమ
- విజిలెన్స్ తనిఖీల్లో బయటపడిన బాగోతం.. అదనపు కలెక్టర్ కు నివేదిక



అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి:
అక్షర దర్బార్, ప్రధానప్రతినిధి: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కుంభకోణాల్లో ఇది సరికొత్త రకం. ఇప్పటివరకు మనం పౌరసరఫరాల శాఖ అప్పగించిన సీఎంఆర్‌ను రైస్ మిల్లుల యాజమాన్యాలు అప్పగించకపోవడం, ఆ సరుకును బయటకు తరలించి యాజమాన్యాలు సొమ్ము చేసుకోవడం వంటి కుంభకోణాలనే చూసి ఉన్నాం. ఆ తరహా కుంభకోణాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సరుకు మిల్లులకు తరలుతుంది. కొనుగోలు కేంద్రాలు, పౌర సరఫరాలశాఖ నుంచి ట్రక్ షీట్లు సైతం జారీ అవుతాయి. కానీ, ఈ కొత్త కుంభకోణంలో అసలు ధాన్యం ఉండదు. ధాన్యం అప్పగించిన రైతులు ఉండరు. ట్రాకింగ్ షీట్లు జారీ అవుతాయి. ధాన్యం మిల్లుకు తరలినట్లు ఆధారాలుంటాయి. ప్రభుత్వం నుంచి సుమారు 35 మందికి పైగా బ్యాంకు ఖాతాల్లో మాత్రం ధాన్యం సేకరణకు సంబంధించిన రూ.1.70 కోట్ల నిధులు జమయ్యాయి. ఇదంతా హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని సాంబశివ రైస్ మిల్లు యజమాని చేసిన నిర్వాకం. బంధువులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులైన కుమార్తె, భార్య, అల్లుడు ఖాతాల్లో ఈ మొత్తం జమవడం గమనార్హం. ఒక్క భార్య ఖాతాలోనే రూ.24 లక్షల వరకు జమ కావడం విశేషం. సీఎంఆర్ పరిశీలించేందుకు ఇటీవల మిల్లుకు వెళ్లిన విజిలెన్స్ అధికారులు ఈ కుంభకోణాన్ని గుర్తించారు.

### - మోసం ఎలా అంటే..

సాంబశివ రైస్ మిల్లు యజమాని గత యాసంగి సీజన్ లో శాయంపేట మండలం పత్తిపాక, కాట్రపల్లి ఐకేపీ ధాన్యం కొనుగోలు సెంటర్లతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అంతకుముందు మండల స్థాయిలో వ్యవసాయశాఖ విస్తరణ అధికారుల (ఏఈవో)తో వరి పంట సాగు చేసినట్లు సృష్టించాడు. తద్వారా ఐకేపీ సెంటర్లలో ధాన్యం కొనుగోలు చేసినట్లు రికార్డులు సృష్టించాడు. సుమారు 35 మంది నుంచి ధాన్యం సేకరించినట్లు, ఆ ధాన్యం చివరకు సాంబశివ రైస్ మిల్లుకు తరలినట్లు పౌర సరఫరాలశాఖ పత్రాల్లో చూపించాడు. ఇలా రైస్ మిల్లు యజమాని అసలు ధాన్యమే లేకుండా, కొందరు పంట సాగు చేసినట్లు, ఆ పండించిన ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాల్లో విక్రయించినట్లు, అలా సేకరించిన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం తన మిల్లుకు పంపించినట్లు సృష్టించాడు. ఇలా పౌర సరఫరాలశాఖ, వ్యవసాయశాఖ అధికారుల, ఐకేపీ సిబ్బంది ప్రమేయంతో మిల్లు యజమాని కొత్తరకం కుంభకోణానికి తెరతీశాడు. పౌర సరఫరాలశాఖ మధ్యలో సీఎంఆర్ విషయం పట్టించుకోకపోవడం, ఒక్కసారైనా సీఎంఆర్ నిల్వలను తనిఖీ చేయకపోవడం, వ్యవసాయశాఖ ధాన్యం పండించకుండానే విక్రయానికి రశీదులు జారీ చేయడం ఈ కుంభకోణానికి కారణమని స్పష్టంగా కనిపిస్తున్నది.

### - అదనపు కలెక్టర్ కు నివేదిక

సాంబశివ రైస్ మిల్లు కుంభకోణంపై ఇప్పటికే విజిలెన్స్‌శాఖ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. నాలుగు నెలల క్రితం ఈ తతంగమంతా జరిగిందని గుర్తించింది. కుంభకోణం ఎలా జరిగింది.. ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు, పౌరసరఫరాల శాఖ, వ్యవసా యశాఖ అధికారులు ఎలా సహకరించారు.. రైస్ మిల్లు యాజమాని కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు... సుమారు 35 మంది ఖాతాల్లో ఎంతెంత జమ అయిందన్న విషయాలను నివేదికలో పొందుపరిచింది. విజిలెన్స్‌శాఖ ఇటీవల ఆ నివేదికను అదనపుకలెక్టర్‌కు సైతం అందించినట్లు తెలిసింది. ఇప్పుడు ఆ నివేదికపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

# ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

## హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

అక్షరదర్బార్, హనుమకొండ: జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు త్వరగా ప్రారంభించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సెర్ప్, డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఖరీఫ్ 2025 –26 సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలుపై ధాన్యం కొనుగోలు కమిటీ ప్రతినిధులు, సీసీలు, ఏపీఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించాలన్నారు. వ్యవసాయ అధికారులు జారీ చేసిన టోకెన్ కలిగిన రైతుల వద్ద మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని, ప్రతి కొనుగోలు కేంద్రం వారు సక్రమంగా పుస్తక నిర్వహణ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా టోకెన్ ఇచ్చిన రైతులకు మాత్రమే గన్నీ బ్యాగులను ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో కనీస సౌకర్యాలు అయిన త్రాగునీరు, నీడ కొరకు షెడ్డు, కరెంటు, లైట్ సౌకర్యము, మహిళా రైతుల కొరకు తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీపీసీ కేంద్రానికి ఇచ్చిన ప్యాడీ క్లీనర్లను అన్నిటిని వాడాలని తెలియజేశారు.



కమలాపూర్, హసన్ పర్తి మండలాలలో వరి కోతలు మొదలైనందున సోమవారం వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, అడిషనల్ డిఆర్డిఓ వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ డీపీఎం రాజేంద్రప్రసాద్, జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ , జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, ఏవోలు, ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

# 12న ఉచిత మెగా హెల్త్ క్యాంపు

## - ముఖ్యఅతిథిగా హాజరుకానున్న మంత్రి సీతక్క

అక్షరదర్బార్, ఏటూరునాగారం: ఏటూరునాగారం మండలం చిన్న బోయినపల్లి గ్రామంలో ఈనెల 12న ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు వరంగల్ జ్ఞానదా ఫౌండేషన్ ప్రకటించింది. ములుగు జిల్లా పోలీస్ సహకారంతో ఉదయం 9 గంటల నుంచి ఈ హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన తుమ్మ కోమల–సాయిరెడ్డి దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు తుమ్మ ప్రభాకర్ రెడ్డి వరంగల్ లోని కేఎంసీలో పీడీగా, రెండో కుమారుడు తుమ్మ శ్రీధర్ రెడ్డి పాత్రికేయ వృత్తిలో, మూడో కుమారుడు సంజీవరెడ్డి రాజకీయ రంగంలో ఉన్నారు. ఈ ముగ్గురు తమ తల్లిదండ్రులు, కుమారుడు తుమ్మ జయసింహారెడ్డి దివంగతులు కావడంతో వారి జ్ఞాపకార్థం తమ ఊరికి ఏదైనా చేయాలనే తపనతో గతంలో చిన్నబోయినపల్లితో పాటు పరిసర గ్రామాలకు ఉచిత వైద్యం అందించేందుకు వైద్యశాల, సురక్షిత తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్, స్వర్గరథం, ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా తాజాగా ఆదివారం చిన్నబోయినపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రముఖ వైద్యులతో ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంపు నిర్వహించేందుకు తుమ్మ ప్రభాకర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సంజీవ రెడ్డి నిర్ణయించారు. మహిళలకు చీరలు, పాఠశాల విద్యార్థులకు దుస్తులు, నోట్ బుక్స్ పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర్, ఎస్పీ శబరీష్, ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ నందకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ నాగార్జునరెడ్డి, కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్య అనిల్, ములుగు అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, కాసం గ్రూప్ చైర్మన్ కాసం నమ:శివాయ తదితరులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.




# ముగ్గురు మావోయిస్టు అగ్ర నేతల లొంగుబాటు

## - వివరాలు వెల్లడించిన డీజీపీ శివధర్ రెడ్డి

అక్షరదర్బార్, హైదరాబాద్: డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట శుక్రవారం కుంకటి వెంకటయ్య అలియాస్ వికాస్, మొగిలిచర్ల వెంకట్రాజు అలియాస్ చందు, తోడెం గంగ అలియాస్ సోనీ అనే మావోయిస్టు కీలక నేతలు లొంగిపోయారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ వివరాలు వెల్లడించారు. మావోయిస్టు పార్టీ నుంచి బయటికొచ్చి ముగ్గురు అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నారని తెలిపారు. ఈ ముగ్గురూ మావోయిస్టు పార్టీలో రాష్ట్ర కమిటీ స్థాయి నాయకులు. సిద్దిపేట జిల్లాకు చెందిన కుంకటి వెంకటయ్య 1990లో పీడబ్ల్యూజీ ఏర్పాటు చేసిన రైతు కూలీ సభలకు హాజరై.. అదే ఏడాది అజ్ఞాతంలోకి వెళ్లారని వివరించారు. పిడబ్ల్యూజీ కమాండర్ బాలన్న ఆధ్వర్యంలో దళంలో చేరారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి 35 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పని చేశారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపును అందుకుని.. జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నారని వెల్లడించారు. హనుమకొండ జిల్లా ధర్మసాగరం మండలం తాటికాయల గ్రామానికి చెందిన మొగిలిచర్ల వెంకటరాజు(45) .. 11 ఏళ్ల వయసులోనే విప్లవగీతాలకు ఆకర్షితుడై మావోయిస్టు ఉద్యమంలో చేరారని వివరించారు. 1993లో నర్సంపేట దళంలో రిక్రూట్ అయి రాష్ట్రస్థాయి కమిటీలో వివిధ హోదాల్లో పనిచేశారని తెలిపారు. మావోయిస్టులతో వచ్చిన సైద్ధాంతిక విభేదాల కారణంగా, పోలీసులు ఇచ్చిన పిలుపును అందుకుని అతని భార్య తోడెం గంగతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారని వివరించారు. ఇటీవల కాలంలో 403 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారని తెలిపారు.

## బీసీ రిజర్వేషన్ల బిల్లుకు
# బీజేపీ, బీఆర్ఎస్సే అడ్డు



అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాల కోసం తీసుకున్న అతి ముఖ్యమైన నిర్ణయం బీసీ రిజర్వేషన్ల బిల్లు. రాష్ట్రపతి దగ్గర బీజేపీ ఈ బిల్లుని అడ్డుకుంది అని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు యారా అజయ్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్ల బిల్లును శాసన సభ లో తీర్మానం చేసి రాష్ట్రపతి వద్దకు పంపిస్తే బీజేపీ దాన్ని అడ్డుకుంది. అదే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఆర్డినెన్సు ని కూడా బీజేపీ గవర్నర్ వద్ద అడ్డుకుంది. ఇప్పుడు బీసీ రిజర్వేషన్లపై హై కోర్ట్ స్టే ఇవ్వడంతో బీఆర్ఎస్ పార్టీ సంబరాలు చేసుకుంటుంది. అటు ప్రజా ప్రభుత్వం, ఇటు టీపీసీసీ అహర్నిశలు కష్టించి , రిజర్వేషన్ లు సాధించాలని పని చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సంకల్పం ఎంతో గొప్పది, తప్పకుండ 42% రిజర్వేషన్ సాధించి తీరుతుంది..

## రేపు విద్యుత్ సరఫరాలో
# అంతరాయం

అక్షర దర్బార్, కాటారం :కాటారం సబ్ డివిజన్ పరిధి మండలాలైన కాటారం,మహాదేవపూర్,పలిమెల, మలహర్ మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు కాటారం విద్యుత్ శాఖ ఏడీఏ నాగరాజు ఓ ప్రకటన ద్వారా తెలిపారు.132/33 కేవీ మరమ్మత్తుల పనుల్లో భాగంగా ఉదయం 9 గంటల నుండీ 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు ఏడిఏ వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయా మండలాల ప్రజలు, రైతులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.



# పదవి లేకున్నా ప్రజల కోసం పూర్ణచారి

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ 9వ వార్డు పరిధిలో కొంతకాలంగా కొన్ని వీధిలైట్లు సరిగా వెలుగని సమస్యపై శుక్రవారం స్పందించారు 9వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి. మున్సిపల్ ఎలక్ట్రిషన్ విభాగం సహకారంతో రంగంలోకి దిగి వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు.పదవి లేకున్నా ప్రజల సమస్యలను పట్టించుకుని, మున్సిపాలిటీ అధికారులకు సమాచారం ఇచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేయడం పూర్ణచారి గొప్పతనాన్ని చాటుతోంది. "పదవిలో ఉన్నా లేకున్నా, ప్రజలతోనే నేను" అన్న మాటను ఆయన మరోసారి నిజం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వార్డు నివాసితులు పూర్ణచారికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజల పక్షాన నిలబడే నాయకుడు అని అభినందనలు తెలిపారు.



# మానసిక ఆరోగ్యం ముఖ్యం
### దివ్యాంగులకు అండగా న్యాయసేవాధికార సంస్థ




అక్షరదర్బార్, భూపాలపల్లి : శరీర ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం సక్రమంగా ఉన్నప్పుడే జీవితం సార్థకం అవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రమేష్ బాబు అన్నారు. హెచ్ఎంఆర్డీఎస్ ఆధ్వర్యంలోని దివ్యాంగ బాలల పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మానసిక సమస్యల వల్లే గంజాయి, డ్రగ్స్ కు బానిసై నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు పండ్లు, చాకోలెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి. శ్రీనివాస చారి, గవర్నమెంట్ ప్లీడర్ బొట్ల భిక్షపతి హోమ్ నిర్వాహకులకు రూ. పదివేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి , న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఏ. నాగరాజ్ , ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి. అఖిల డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ శ్రీమతి కే.అక్షయ హెచ్.ఎం.ఆర్.డి.ఎస్ సంస్థ నిర్వాహకులు రజిత , రాజయ్య న్యాయవాది మొయినుద్దీన్ పాల్గొన్నారు.



## అయోమయంలో
# ఆశావాహులు

### - రిజర్వేషన్లపై హైకోర్టు స్టేతో కలకలం

అక్షరదర్బార్, పరకాల: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన కొద్ది గంటల్లోనే, హైకోర్టు ఇచ్చిన స్టేతో బీసీ రిజర్వేషన్ ఆశించన ఆశావాహులు మరోసారి అయోమయంలో పడిపోయారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీఓ 9 ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించగా, దీనిపై పలు పిటిషన్లు హైకోర్టుకు చేరాయి. ఈ నేపథ్యంలో విచారణ జరిపిన హైకోర్టు బీసీ రిజర్వేషన్ల అమలుపై స్టే విధించింది. దీంతో ఇప్పుడేం చేయాలి? అనే ప్రశ్నతో మాయమయ్యే రాత్రులు గడిపిన ఆశావాహులు, సీట్లు ఖరారు కావాలనే ఉత్సాహంతో ఇప్పటికే వ్యూహాలు రచించినవారు ఇప్పుడు గందరగోళంలో పడ్డారు. "ఇన్ని రోజులు ఖర్చు పెట్టినదీ వృథా అయినట్లేనా?" అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### - ప్రతిపక్షాల మండిపాటు..

ప్రస్తుత పరిస్థితుల్లో అధికార పార్టీపై ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నాయి. “బీసీల పేరుతో ప్రభుత్వం డ్రామా ఆడింది. కోర్టు ఆదేశాలతో అసలు కుటిల రాజకీయం బయటపడింది” అని బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఆరోపించారు. ప్రజల విశ్వాసాన్ని కొల్లగొట్టేలా అధికార పార్టీ వ్యవహరించిందని మండిపడుతున్నారు.

### - కోర్టు తీర్పే కీలకం

హైకోర్టు నాలుగు వారాల వ్యవధిలో ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ కాలంలో ప్రభుత్వం ఆధారాలు, సామాజిక డేటాను సమర్పించాల్సి ఉంటుంది. కోర్టు తీర్పు ఆధారంగానే రిజర్వేషన్లపై తుది నిర్ణయం జరగనుంది. ఇవే రిజర్వేషన్లు అమలవుతాయా? లేక మళ్లీ రిజర్వేషన్ల ఖరారు జరగనుందా? అన్న ప్రశ్నకు ఇప్పుడే సమాధానం చెప్పడం సాధ్యం కాని పరిస్థితి. కానీ, బీసీ సామాజిక వర్గాలకు అనుకూలంగా నిర్ణయం రావాలనే ఆశావహులు కోరుకుంటున్నారు. ప్రభుత్వం చట్టపరంగా, రాజ్యాంగపరంగా సరైన ప్రక్రియలు అనుసరించి, న్యాయస్థానంలో మెరుగైన వివరణ ఇవ్వడం తప్పనిసరి.



# బీమా చెక్కు అందించిన సీపీ

అక్షరదర్బార్, హనుమకొండ: రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆర్మ్డ్ రిజర్వ్ కానిస్టేబుల్ కుటుంబానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును కానిస్టేబుల్ భార్య కీర్తికి శుక్రవారం అందజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మ్డ్ రిజర్వ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న పి హాతీరామ్ గత సంవత్సరం మే నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ సందర్భంగా మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వం తరుపున అందజేయాల్సిన బెనిఫిట్లను సకాలంలో అందజేసేందుకు తగు చర్య తీసుకోవాల్సిందిగా సీపీ అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సూపరింటెండెంట్ యాకుబ్ బాబా, సహాయకుడు తులసి పాల్గొన్నారు.



# స్టడీ మెటీరియల్ పంపిణీ

అక్షర దర్బార్, గణపురం : కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ డాక్టర్ కోడూరు నవీన్ కుమార్ జన్మదినం సందర్భంగా పదవ తరగతి విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. గణపురం బీసీ బాలికల వసతి గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, మేట్రన్ జి. మాధవి చేతుల మీదుగా రూ.5 వేల విలువైన ఆల్ ఇన్ వన్, మోడల్ పేపర్లు అందజేశారు. గత 20 సంవత్సరాలుగా ఆలయ అభివృద్ధికి సేవలు అందిస్తున్న డాక్టర్ కోడూరు నవీన్ కుమార్ సేవలను ప్రసంశిస్తూ, ఆయన జన్మదిన వేడుకలు విద్యార్థినుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. పరిరక్షణ కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# తోట సుధాకర్ కు పలువురి పరామర్శ

అక్షర దర్బార్, పరకాల: టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రజాపక్షం ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో ఇంచార్జ్ తోట సుధాకర్ మాతృమూర్తి తోట వెంకటమ్మ ఇటీవల మృతి చెందగా సుధాకర్ తో పాటు వారి కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా నడికూడ మండలం చౌట్ పర్తి గ్రామానికి చేరుకుని తొలుత తోట వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఐ, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు, జర్నలిస్టు నాయకులు ఉన్నారు.



# వెల్లంపల్లిలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం

అక్షర దర్బార్, పరకాల: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసిడిఎస్ పరకాల, నాగారం సెక్టార్ పరిధిలోని వెల్లంపల్లి గ్రామంలో సూపర్వైజర్ జె. రాణి ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, వివక్షలను నివారించి, వారి హక్కులను సమాజానికి తెలియజేయడమే ఈ దినోత్సవ ఉద్దేశమని చెప్పారు. బాలికలు విద్య, పోషణ, వైద్య సంరక్షణ, చట్టపరమైన హక్కులు, రక్షణ, హింస, బాల్యవివాహం తదితర రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై సమాజం అవగాహన కలిగి, వారి అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్ అనిత, ఉపాధ్యాయులు రానా, అంగన్వాడీ టీచర్లు మమత, పద్మ, రమ, హేమలత, సుజాత, స్వర్ణతో పాటు తల్లులు, విద్యార్థినులు, చిట్టితల్లులు పాల్గొన్నారు.

# 42 శాతం అమలు చేయాలి



అక్షర దర్బార్ శాయంపేట : కేంద్ర ప్రభుత్వం తక్షణమే బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని తెలంగాణ సీపీఐ  రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగర సాంబయ్య అన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ 10% రిజర్వేషన్ ఇచ్చినప్పుడే 60 శాతానికి రిజర్వేషన్లు చేరాయని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం అని గొప్పగా చెప్పుతున్న మనం ప్రజాస్వామ్య  స్ఫూర్తికి విరుద్ధంగా ఆరు శాతం ఉన్న అగ్రకులాలకు ఎలాంటి కమిషన్ లేకుండా ఏ పోరాటం చేయకుండానే బంగారం పళ్లెంలో 10% రిజర్వేషన్లు అనాలోచితంగా అమలు చేశారని అన్నారు. బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు ద్రోహం చేస్తున్నాయని మండిపడ్డారు. బీసీలందరూ ఏకతాటిపై రావాలని భవిష్యత్తులో ద్రోహం చేసిన పార్టీలను భూస్థాపితం చేయాలని కోరుతూ ఇప్పటికైనా రిజర్వేషన్ పెంపును తొమ్మిదో షెడ్యూల్లో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ చేస్తూ తక్షణమే పార్లమెంటును సమావేశపరచాలని డిమాండ్ చేశారు.



# రిజర్వేషన్లపై అగ్రకుల కుట్రలను తిప్పికొట్టాలి

నల్లబెల్లి : బీసీల రిజర్వేషన్లను అడ్డుకునేందుకు అగ్రకులస్తులు కుట్రలు పన్నుతున్నారని చింతకింది కుమారస్వామి అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో 42% బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని 9వ షెడ్యూల్లో చేర్చకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం కూడా కాలయాపన చేస్తోందని పేర్కొంటూ, బీసీల హక్కుల కోసం అన్ని పార్టీలు, సంఘాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వైనాల వీరస్వామి బీసీ హక్కుల  సాధన సమితి మండల కన్వీనర్ కడియాల క్రాంతి కుమార్ మండల నాయకులు కోలా లింగయ్య  మామిండ్ల పెద్ద ఐలయ్య  బొడిగే నారాయణస్వామి. శ్రీను తదితరులు పాల్గొన్నారు .

# బీసీలకు హామీపై కట్టుబడి ఉన్నాం

## బీసీ ద్రోహులుగా బీజేపీ, బీఆర్ఎస్ : దూదిపాల బుచ్చిరెడ్డి



అక్షర దర్బార్, శాయంపేట : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీపై పూర్తిగా కట్టుబడి ఉందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కొప్పుల, జోగంపల్లి, పెద్ద కొడెపాక, గోవిందపూర్, హుస్సేన్పల్లి, పత్తిపాక గ్రామాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి ప్రజల సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం శాస్త్రీయ కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చట్టం పాస్ చేసి గవర్నర్, రాష్ట్రపతికి పంపిందని, కానీ బిజెపి అడ్డుపడిందని విమర్శించారు. అలాగే 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని కుదించిందని, ఎన్నికల తర్వాత కులగణన చేసి పెంచాల్సిన బాధ్యత నిర్వర్తించలేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, మారేపల్లి రవీందర్, చిందం రవి, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, డి.టి.రెడ్డి, సామల మధుసూదన్, నిమ్మల రమేష్, వైనాల కుమారస్వామి, హైదర్, వెంకట్ రాజిరెడ్డి, ఏరుకొండ శంకర్, కొమ్ముల సదానందం, పైడి, బిక్షపతి, భద్రయ్య, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మరోసారి పొడిగింపు

- డిసెంబర్ 31 వరకు స్మార్ట్ సిటీ పథకం గడువు
- ఎంపీ విజ్ఞప్తిపై కేంద్రం సానుకూల స్పందన

అక్షరదర్బార్, వరంగల్: స్మార్ట్ సిటీ పథకం కింద వరంగల్, హనుమకొండ నగరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు మరో అవకాశం లభించింది. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కృషి ఫలితంగా కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ పథకం గడువును ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు పొడిగించింది. ఇప్పటికే పలు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, పబ్లిక్ సౌకర్యాల భవనాలు, సరస్సుల అభివృద్ధి వంటి పనులు తుదిదశకు చేరుకున్నాయని అధికారులు తెలిపారు. ఈ పనులు పూర్తికావడానికి మరికొంత సమయం అవసరమని ఎంపీ కడియం కావ్య జులై 31న పార్లమెంట్లో కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు వివరించారు. గతంలో కూడా సీఎం రేవంత్ రెడ్డితో కలిసి స్మార్ట్ సిటీ పనుల గడువును పొడిగించాలని కేంద్రాన్ని కోరిన ఎంపీ కడియం కావ్య ఆ విజ్ఞప్తి ఫలితంగా మార్చి 2025 వరకు గడువు లభించగా, తాజాగా మరోసారి ఎంపీ డా కడియం కావ్య చొరవతో 2025 డిసెంబర్ వరకు పొడిగింపును కేంద్రం మంజూరు చేసింది. ప్రస్తుతం పెద్ద వడ్డేపల్లి చెరువు సుందరీకరణ నిలిచిపోయింది. ఈ పనుల్లో గ్రీనరీ, లైటింగ్, ల్యాండ్ స్కేపింగ్, పాత్ వే, వాకింగ్ ట్రాక్, స్వాగత తోరణాల ఏర్పాటు ఉన్నాయి. హనుమకొండలోని పద్మాక్షిగుట్ట, ఎన్జీవోస్ కాలనీలలో సెంట్రల్ లైటింగ్, గ్రీనరీ పనులు, అండర్ డ్రైనేజీ వ్యవస్థ పనులు పూర్తి చేయాల్సి ఉంది. వరంగల్లోని పోతన రోడ్డు, పాపయ్యపేటలో నిలిచిపోయిన స్టోర్మ్ వాటర్ డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ కీలకమైన ప్రాజెక్టులో సుమారు రూ.12 కోట్ల విలువైన గ్రీనరీ పనులు, పోతన రోడ్డులో స్వాగత తోరణం నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను చేపట్టాల్సి ఉందని ఎంపీ తెలిపారు. కరీమాబాద్ దసరా రోడ్డు, రంగశాయిపేట– ఉర్సు, కరీమాబాద్లలో స్మార్ట్ రోడ్ల కింద పాత్ వేలు, లైటింగ్, గ్రీనరీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షలు నిర్వహించి వేగవంతం చేయాలని ఎంపీ డా కడియం కావ్య సూచించారు.

# వాలీబాల్ పోటీలకు జూకల్ విద్యార్థినులు



అక్షర దర్బార్, చిట్యాల : భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని జూకల్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు నూనేటే ఐశ్వర్య, కొడారి శరణ్య ఇంటర్–డిస్ట్రిక్ట్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో జరిగిన 69వ ఎస్.జి.ఎఫ్.ఐ అండర్–17 బాలికల వాలీబాల్ జిల్లా స్థాయి పోటీల్లో ఈ విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు పొందారు. అక్టోబర్ 14న వరంగల్లో జరిగే పోటీలలో వీరు పాల్గొననున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరగాని కృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ గాజర్ల శ్రీనివాసును అభినందిస్తూ, విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో కూడా విజయాలు సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇసుక రవాణాపై కఠిన చర్యలు

అక్షర దర్బార్,టేకుమట్ల: మండల పరిధిలో ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక రవాణా చేసేవారు ప్రతీ లోడుకు తెలుపు రంగు ఒరిజినల్ కూపన్ మరియు నీలిరంగు డూప్లికేట్ కూపన్ తప్పనిసరిగా తీసుకోవాలని, అలాగే లోడింగ్ అనంతరం లోడు ధ్రువీకరించు అధికారి సంతకం తీసుకున్న తర్వాత మాత్రమే బయలుదేరాలని అధికారులు పేర్కొన్నారు. మార్గమధ్యంలో ఆకస్మిక తనిఖీల సమయంలో అధికారి సంతకం లేని ఒరిజినల్ పత్రం కనుగొనబడినట్లయితే ట్రాక్టర్ను సీజ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తనిఖీ సమయంలో డ్రైవర్ తప్పనిసరిగా పర్మిషన్ కాపీని చూపించాలని, “ఓనర్ దగ్గర ఉంది”, “ఇంట్లో ఉంది” అంటూ కాలయాపన చేస్తే కేసు నమోదు చేసి ట్రాక్టర్ను కోర్టుకు పంపిస్తామని అధికారులు స్పష్టం చేశారు.అదేవిధంగా ప్రతి ట్రాక్టర్ వద్ద నంబర్ ప్లేట్, ఇన్సూరెన్స్, ట్రాలీ నంబర్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. డ్రైవర్లు ఇయర్ఫోన్లు లేదా సెల్ఫోన్లు వాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు.

# బీజేపీ ఆదరణను తట్టుకోలేక 'ఓటు చోరీ' నాటకం

## బీజేపీ జిల్లా నాయకుడు లడే శివ



అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలంలో భారతీయ జనతా పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఉత్సాహభరితమైన ఆదరణను చూసి తట్టుకోలేక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి ఓటు చోరీ అనే కొత్త నాటకానికి తెరలేపారని బిజెపి జిల్లా నాయకుడు లడే శివ ఘాటుగా విమర్శించారు.గత వారం రోజులుగా బిజెపి యువ నాయకుడు లడే శివ చేపట్టిన ప్రజా సంపర్క యాత్రలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించడంతో, కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అసహనం వ్యక్తమవుతోందని ఆయన అన్నారు."ప్రజల మద్దతు పొందుతున్న బిజెపికి భయపడి కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సందర్భంలో భూపాలపల్లి నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గెలిచిన విషయాన్ని ప్రస్తావిస్తూ, "అక్కడ ఓటింగ్ జరిగి ఎమ్మెల్యే గెలిచాడంటే ఓటు చోరీ ఎక్కడ జరిగింది? అప్పుడెందుకు ఈ ఆరోపణలు చేయలేదు?" అంటూ బుచ్చిరెడ్డిని ప్రశ్నించారు.

# టార్గెట్ 2.50 లక్షల టన్నులు

- 266 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక
- ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



అక్షరదర్బార్, వరంగల్: జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రానున్న ఖరీఫ్ 2025-26 సీజన్ లో ధాన్యం సేకరణపై మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టర్లతో శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జడ్పీ సీఈఓ ఇంచార్జ్ డీఆర్‌డీఓ రాంరెడ్డి, డిఏఓ అనురాధ, డీసీఓ నీరజా, డీసీఎస్ఓ కిష్టయ్య, డీఎం సంధ్యారాణి, డీఎంఓ సురేఖ, ఆర్టీవో శోభన్, లీగల్ మెట్రోలజీ మనోహర్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుండి ధాన్యం సేకరణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. లారీ ట్రాన్స్‌పోర్టర్లు సకాలంలో రవాణా ఏర్పాట్లు చేసి, రైతుల ధాన్యం ఎక్కడా ఆగకుండా చూడాలని సూచించారు. ఈ ఖరీఫ్ సీజన్ లో దాదాపు వరి ధాన్యం 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనా వేయగా అందుకు గాను 266 ధాన్యం కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేయడమైనదని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి మాట్లాడుతూ గన్ని బ్యాగులు, టార్పాలిన్ అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులని ఆదేశించారు. పీపీసీ సెంటర్లను గతంలో 103 సెంటర్ల గాను ప్రస్తుతం 47సెంటర్లను పెంచి మొత్తం 150 సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామని, ట్రక్ షీట్ లేని వాటిని లోడింగ్ చేయకూడదని, ప్యాడి క్లీనర్ ద్వారా క్లీన్ చేసిన ధాన్యాన్ని సెంటర్లోకి వచ్చేలా చూడాలని డీసీఓ నీరజ పేర్కొన్నారు. ఇన్చార్జ్ డీఆర్డీఓ రామిరెడ్డి మాట్లాడుతూ సెంటర్లను పెంచి త్వరగా ధాన్యం సేకరణ చేసేందుకు సెంటర్ నిర్వాహకులకు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోనెల రవీందర్, కోశాధికారి ఇరుకు కోటేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణ తదితర రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.



# 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరాల్సిందే

- టీఆర్పీ జిల్లా నాయకుడు రవి పటేల్..
- భూపాలపల్లిలో ధర్నా, రాస్తారోకో..
- లీడర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు..



అక్షర దర్బార్,భూపాలపల్లి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరాల్సిందేనని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్పీ)జిల్లా నాయకుడు రవి పటేల్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్త బంద్ లో భాగంగా పార్టీ జిల్లా నాయకులు రవి పటేల్ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ధర్నా, రాస్తారోకో చేశారు. అంతకు ముందు నాయకులు, కార్యకర్తలు కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న విషయాన్ని గమనించిన ఎస్సై సాంబమూర్తి ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తమ సిబ్బందితో వెళ్లి ధర్నా చేస్తున్న నాయకులను బలవంతంగా లాక్కెళ్లి, అదుపులోకి తీసుకుని వదిలేశారు. ధర్నా సందర్భంగా టిఆర్పీ జిల్లా నాయకుడు రవి పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలను అణిచివేయడానికి పెద్ద మొత్తంలో పోలీసులను మోహరించి ఉద్యమాన్ని అణిచివేసే విధంగా కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఏం జరిగినా తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడేది లేదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇచ్చే వరకు పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి పార్టీలకు బీసీలపై చిత్తశుద్ధి లేదని, 42 శాతం రిజర్వేషన్లపై అన్ని పార్టీలు తమ ద్వంద వైఖరిని ప్రకటిస్తున్నాయన్నారు. 64శాతం ఉన్న బీసీలు తమ రిజర్వేషన్ల కోసం తెలంగాణ ఉద్యమ తరహాలో మరో ఉద్యమం చేయవలసిన ఆవశ్యకత ఏర్పడిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ 9లో ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురాకుండా దొంగ కారణాలు చెప్పి వెనకబడేస్తున్నారని విమర్శించారు. అన్ని పార్టీలకు స్థానిక సంస్థల ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో లేదని, ప్రజలంతా కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్పీ జిల్లా నాయకులు కరుణాకర్, చంద్రశేఖర్, సంతోష్, శ్రీను, వెంకన్న, సమ్మయ్య, నవీన్, అక్షయ్, సన్నీ, శంకర్రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి

అక్షరదర్బార్, వరంగల్: సమాచార హక్కు చట్టంపైన పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి సమాచార హక్కు చట్ట వారోత్సవాల్లో భాగంగా అధికారులకు నిర్వహించిన శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి మొదలైన సమాచార హక్కు చట్ట వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 12 వ తేదీ వరకు అధికారులు సమాచార హక్కు వారోత్సవాలను జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో నిర్వహించాలని, అధికారులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, అప్పిలేట్ అథారిటీ, పీఐఓలు, ఏపీఐఓలు, ట్రైనర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# కాటారంలో మట్టి తోడేళ్లు..!

- యథేచ్ఛగా సాగుతున్న మట్టి దందా
- సిండికేటైనా ట్రాక్టర్ యజమానులు
- వందలాది ట్రాక్టర్లతో మట్టి కొడుతున్న వైనం
- సెలవు దినాలే వారి టార్గెట్
- ధ్వంసమవుతున్న సీసీ రోడ్లు, ప్రధాన రహదారులు
- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు

అక్షరదర్బార్, కాటారం: కాటారం మండలంలో మట్టి తోడేళ్ళు రాజ్యమేలుతున్నాయి. చెరువు, కుంటలు కనిపిస్తే చాలు కొందరు ట్రాక్టర్ యజమానులు తోడేళ్లుగా అవతారమెత్తి యథేచ్ఛగా మట్టిని తోడేస్తున్నారు. రాత్రింబవళ్ళు అనే తేడాలేకుండా వందల సంఖ్యలో ట్రాక్టర్లు రయ్.. రయ్ మంటూ మట్టిని తరలిస్తున్నారు. ప్రధాన రహదారుల గుండానే బాజాప్త మట్టి ట్రాక్టర్లు వెళ్తుండగా చూస్తూ ఊరుకోవడం సమాజం వంతు అవుతున్నది. ఓవైపు సీసీ రోడ్లతో పాటు ప్రధాన రహదారులు ధ్వంసం అవుతుండగా మరోవైపు ట్రాక్టర్లు అధిక వేగంతో వస్తుండంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ వ్యవహారంపై ఇదేంటనే ప్రశ్నించే నాథుడే లేక పోవడంతో అందరికీ తెలిసే జరుగుతుందా అని ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కాటారం మండలంలో మట్టి తోడేళ్ల వ్యాపారం ఇష్టారాజ్యంగా నడుస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.



## - శని, ఆదివారాలే వారి టార్గెట్

సిండికేటైనా ట్రాక్టర్ ఓనర్లు వారి అక్రమ మట్టి దందా కార్యానికి శని, ఆదివారాలను టార్గెట్ చేసుకుంటున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో అధికారులు అందుబాటులో ఉండరని ఈ దందాకు పూనుకుంటుండగా అధికారులకు ఇన్ఫర్మేషన్ చేరవేసిన అదే సమాధానం చెప్పడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రేపు రెండో శనివారం, ఎల్లుండి ఆదివారం రెండు రోజులు సెలవు దినాలు కావడంతో మట్టి దందాను నడిపించేందుకు సమయాత్తమవుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా కాటారం సబ్ డివిజన్ కేంద్రంగా అందరూ చూస్తుండగా మట్టి మాఫియా నడుస్తున్న తీరు యావత్తు సమాజాన్ని ముక్కున వేలేసుకునేలా చేస్తుందని పలువురు అభిప్రాయ ప్రడుతున్నారు.

## - సిండికేటైనా ట్రాక్టర్ యజమానులు

కాటారం మండలకేంద్రంతో పాటు చుట్టు పక్కల పరిసరాల్లో సుమారు 100 ట్రాక్టర్లు ఉండగా ఆ యజమానులంతా సిండికేట్ అయ్యారు. వీరంతా ప్రభుత్వ అనుమతుల ప్రకారం మట్టిని తీసుకెళ్ళాల్సింది ఉండగా అవేం మాకు పట్టవని చెరువులని చెరబడుతున్నారు. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం చెరువుల పరిరక్షణకై చర్యలు తీసుకుంటున్నప్పటికిని వారి లక్ష్యం నీరుగార్చేలా కాటారం మండలంలోని ట్రాక్టర్ ఓనర్లు వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకు గురిచేస్తుంది. వీరి దాష్టీకానికి ప్రస్తుతం కాటారం మండలంలో చెరువులు నామరూపాల్లేకుండా పోయిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదనే చెప్పవచ్చు. ప్రధానంగా కాటారం మండలకేంద్రంలోని జెన్కో పంప్ హౌస్ ఎదురుగా ఓ వ్యక్తి మట్టి దందాను కాంట్రాక్టుగా తీసుకుని నడిపిస్తున్నట్లుగా సమాచారం. ఇందుకుగానూ సదరు వ్యక్తి అందరినీ మ్యానేజ్ చేసుకుంటాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915